# కుచేలుడు

షేక్ హుస్సేన్ సత్యాగ్ని



**నిద్రపట్టక మంచం మీద అటూ ఇటూ పొర్లుతున్నాడు రంగయ్య. పాత నులకమంచం. పిస్సులు ఒదులైనాయి. దొర్లినప్పుడంతా కిర్రు కిర్రుమంటుంది.**

''ఏంది...ఒకేమైన పొర్లుతుండవ్? నిద్రపో. మళ్లపొద్దన్నె లేయాలె కదా!'' అంటూ ఉంది పక్కన వేరొక మంచం మీద మూడేండ్ల బిడ్డతో పడుకున్న భార్య, మొగుడి మీద మిక్కిలి కనికరంతో.

పగలంత పొలం పనిచేసి రెక్కలు ముక్కలు చేసుకుని వస్తాడు. రాత్రయినా బాగా నిద్రపోకుంటే ఒళ్లు అలిసిపోతుందని ఆమె బాధ.

రంగయ్య మధ్యమధ్యలో తల కొంచెం పైకెత్తి పిట్టగోడవైపు ఆతృతగా చూస్తున్నాడు. ప్లాస్టిక్ కవర్‌లోచుట్టి పూలదండ పెట్టాడక్కడ. కవర్‌లో ఏముందోనని పిల్లి చించి దండ పాడు చేస్తుందేమోనని భయం. తాకితే పూలరేకులు రాలిపోతాయని చాలా గోప్యంగా పెట్టాడు. సాకుడు పిల్లి ఎక్కడో మూలన నక్కి పడుకుంది.

రెండంకణాల పూరిల్లు అతనిది. ఒక అంకణం మధ్యలో పిట్టగోడ. అటువైపు పొయ్యీ పొంతా. అక్కడే వాళ్ల వంటావార్పు. బైటి వాకిలికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రెండు మంచాలు వేసుకున్నారు. పిట్టగోడ మీద కిరసనాయిలు బుడ్డి. కరెంటు పోయినప్పుడు వెలిగించుకోడానికి. పైన నిట్టాడుకు ఒకే ఒక కరెంటు బల్బు వేలాడుతూంది. వాకిలికి ముందు చిన్న వసారా. అక్కడే ఎద్దుల్ని కట్టేస్తాడు రంగయ్య.

''మ్యావ్..మ్యావ్' అంటూ ఒళ్లు విదిలించుకుంటూ పిట్ట గోడ వద్దకు వచ్చింది పిల్లి. బహుశా బైట షికారుకు పోయే టైమయ్యిందేమో!

ఒక్క ఉదుటున ఉలిక్కిపడి లేచాడు రంగయ్య. తటాలున మూలనున్న ముల్లుకర్ర తీసుకున్నాడు. మంచంపట్టెకేసి దబాదబ కొట్టాడు. 'ఛెయ్..పోవే!' అంటూ గుడ్లురిమి బెదిరించాడు దాన్ని. ప్రేమగా 'రా!రా!' అని ముద్దు చేస్తూ ముద్ద వేసే రంగయ్య కట్టెత్తుకొని కసురుకుంటూ ఉంటే పిల్లికేమి పాలుపోలేదు. దీనంగా రంగయ్యవైపు చూస్తూ 'మ్యావ్!మ్యావ్!' అంది, 'నేనేం తప్పు చేశాను' అని అడుగుతున్నట్లు. కాని రంగయ్య ఇదేమీ ఒంటపట్టిచ్చుకోలేదు. ఈరోజు రాత్రి అది ఇంట్లో ఉండడం సుతరామూ అతనికి ఇష్టం లేదు. నిర్దయగా కట్టెతో కొట్టబోయాడు. పిల్లి భయపడి వాకిలి దబ్బల్లో నుంచి దూరి బైటికి పరుగెత్తింది. రంగయ్య వాకిలి దబ్బలు దగ్గిరికి జరిపి హమ్మయ్య అనుకొని వచ్చి నిశ్చింతగా పడుకున్నాడు.

కళ్లు మూసుకున్నాడే గాని బొత్తిగా నిద్ర పట్టడం లేదు. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని ఒకే తొందర. 'ఏందీ.. పాడు రాత్రి ముందుకు జరగనే జరగదు..' అప్పుడప్పుడు విసుక్కుంటున్నాడు.

భార్య గురకలు పెడుతూ గాఢ నిద్రలో మునిగిపోయింది.

ఆవూళ్లో రంగయ్య మేనమామ ఉన్నాడు. పక్క వీధిలోనే వాళ్ల ఇల్లు. తన భార్య తర్వాత ఇద్దరూ ఆడబిడ్డలే. ఆ ఇంటికి ఇల్లరికం వచ్చాడు రంగయ్య. అతని సొంతవూరు అక్కడికి ఐదు కిలోమీటర్ల దూరం.

సుమారు పదేండ్ల కిందట అతని పెళ్లయింది. అర్ధెకర భూమిచ్చి పక్కన కొట్టమేసి ఇచ్చినాడు మామ. తన పొలం సాగు చేసుకుంటూ ఊర్లో పెద్ద రైతులకు బాడుక్కు పోతూ ఉంటాడు. మూడేండ్లుగా వరుస కరువు. బొత్తిగా పైర్లు పండడం లేదు. చిన్న రైతులందరూ 'నాగు గింజలు' తెచ్చుకుని కష్టంగా కాలం గడుపుకుంటున్నారు.

అంత పెద్దవూరు కాదది. పదిండ్లు పెద్ద రైతులుంటారు. మిగతా వాళ్లంతా ఎకరా, అరెకరా, లేదంటే కూలి చేసుకునేవాళ్లే. కొన్ని ముస్లిం కుటుంబాలు కూడా ఉన్నాయి. పొరపచ్చాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉంటారు.

మొన్నటిదాకా ఊర్లో మంచినీళ్లకు కటకట. చేదుడు బాయి ఒక్కటే గతి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తన సొంతవూరు ఆసామి బాల చంద్రుడు గెలిచాడు. ఆయన చిన్న వయసులోనే మంత్రి కూడా అయినాడు. అతని పుణ్యమా అని ఆ ఊరికి రక్షిత మంచి నీటి పథకం వచ్చింది. వీధివీధినా కుళాయిలు బిగించారు. దీన్ని ప్రారంభించడానికి రేపు పది గంటలకు మంత్రి ఆ ఊరికొస్తున్నాడు.

ఊరంతా పండగ వాతావరణం నిండుకుంది. రంగయ్యకు పట్టపగ్గాల్లేవు. ఆనందంతో ఉరకలేస్తున్నాడు, ఊరంతా కలయదిరుగుతున్నాడు. కన్పించిన ప్రతివాడితో తానే కల్పించుకొని మాట్లాడుతున్నాడు. 'బాలచంద్రుడిది మా వూరే! మా వూరి వీధి బడిలో ఇద్దరం ఐదో తరగతి దాకా కలిసి చదువుకున్నాం. నేనంటే వొల్లమాలిన అభిమానం' అంటూ ఒకటే చెప్పడం.

మంత్రి ప్రోగ్రాం తెలుస్తూనే ఆయనకు దండ వేయాలనుకున్నాడు. కాని తన దగ్గర ఎర్ర ఏగాని లేదు. ఒక పెద్ద రైతుకు తన దిబ్బలో ఎరువు ఇస్తానని ఇరవై రూపాయలు అడ్వాన్సుగా తెచ్చుకున్నాడు. పది కిలోమీటర్ల దూరమున్న మండల కేంద్రానికి పోయి పూలదండ కొనుక్కొచ్చాడు. దగ్గరుండి కొసరి కొసరి కట్టించాడా దండ. వాడిపోతుందని నీళ్లు చల్లి జాగ్రత్తగా పిట్టగోడ మీద పెట్టాడు.

రంగయ్య ఆలోచనలు తమ బాల్యం మీదికి మళ్లాయి.

బాలచంద్రుడు పెద్దింటి అబ్బాయి. అయినా తన ఈడు పిల్లలతో కలిసిమెలిసి బాగా తిరిగేవాడు. పొద్దస్తమానమూ రంగయ్య వెన్నంటే ఉండేవాడు. చాలా సార్లు రంగయ్యను తండ్రి మందలించేవాడు.

'బడిలేనప్పుడు ఇంట్లో పనీపాటా చేసుకోకుండా పెద్దోళ్ల పిల్లల్ని వెంటబెట్టుకుని తిరిగితే ఎట్లరా?' అని. ఆ మాటలేవీ చెవిన వేసుకునేవాడు కాదు రంగయ్య.

ప్రతిరోజూ మధ్యాహ్నం బువ్వ తిన్నాక ఊరిబైట దొరివిబాయికి పోతారు, ఈదులాడేదానికి. బాయి గట్టుమీదుండి సొరంగాలు కొట్టడంలో పోటీలు. రంగయ్య, బాలచంద్రులు అందరికంటే ఫస్టు అని పిల్లలందరు పొగిడేవాళ్లు. గుటకపట్టి లోపలికి పోయి పూడు తెచ్చేవాళ్లలో కూడా వాళ్లదే పైచేయి.

సాయంత్రం పూట బడి ఒదుల్తూనే రకరకాల ఆటలు. ఒక్కోరోజు ఒక్కొక్క ఆట. అన్నిట్లో బాలచంద్రుని గుంపుదే గెలుపు. శని- ఆదివారాల సెలవు దినాలు మామిడి తోపుల్లో, చీనీ వనాల్లో, బెల్లం చెరుకు తోటల గట్లమీద ఎక్కడ చూసినా వాళ్ల గుంపే.

ఊర్లో రైతులెవ్వరూ బాలచంద్రుని పల్లెత్తు మాట అనేవారు కాదు. రైతులందరూ వాళ్ల మండీలో ఖాతాదారులే.

ఒకరోజు మామిడితోపులో పెద్ద గండం గడిచింది బాలచంద్రునికి. అతను గురి చూసి రాళ్లతో మామిడి కాయలు కొడుతున్నాడు. ఎండుటాకుల్లో పడుకున్న పామును చూడకుండా తొక్కినాడు. అది బుస్సని పడగెత్తి లేచి తోకమీద నిలబడింది. ఏ క్షణంలోనైనా అది బాలచంద్రుణ్ని కాటు వేసేసేది. బాలచంద్రుడు అది గమనించనే లేదు. ఒక మిత్రుడు చూసి 'అమ్మో...పాము!' అంటూ కేకలు వేశాడు. దాంతో అందరూ భయంతో అక్కడ్నుంచి పరుగెత్తిపోయారు. బాలచంద్రుడు కంగారుగా అటూ ఇటూ చూశాడు. తన చెంత బుసలు కొడుతున్న పామును చూసి వొణికిపోయాడు. ఇది గమనించాడు రంగయ్య. పాము ఇక బాలచంద్రుణ్ని కాటు వేయబోతున్నంతలో మెరుపు తీగ వలె ఒక్క ఉదుటున పాము తల మీద బలంగా కట్టెతో కొట్టాడు. పాము విదిలించుకునేసరికి మరో దెబ్బ వేశాడు. దెబ్బమీద దెబ్బ వేశాడు. పాము గిలగిలలాడుతూ చచ్చిపోయింది.

మిత్రులందరూ రంగయ్య చుట్టు చేరి ఎంతగానో మెచ్చుకున్నారు. బాలచంద్రుడికి వణుకు తగ్గలేదు. రంగయ్యను గుండెకు హత్తుకున్నాడు. 'నన్ను బతికించావ్‌రా!' అన్నాడు హృదయంలో నుంచి. అతని మాటలు తడబడుతున్నాయి.

ఐదో తరగతి ఐపోయింది. బాలచంద్రుణ్ని పై చదువులకు పట్నం పంపించారు. అప్పుడప్పుడు అతను గ్రామానికి వచ్చినప్పుడు చిన్ననాటి మిత్రులందరితో కలిసేవాడు. బస్తీ నుంచి తెచ్చిన తినుబండారాలు అందరికీ పంచి పెట్టేవాడు. కొంచెం పాతబడిన బట్టలన్నీ తెచ్చి గుట్టుగా రంగయ్య కిచ్చేవాడు. ఊర్లో ఉన్ననాళ్లు ఆటలూ పాటలూ, సంతోషంతో కాలం సరిపోయేది కాదు.

సంసార పరిస్థితులు చితికి పోయి ఐదో తరగతితోనే రంగయ్య చదువు ఆగిపొయ్యింది. అతనికేమో బాలచంద్రునితోపాటు చదువుకోవాలని ఆశ. కాని అతని ఆశ అడియాశే అయ్యింది.

ప్రతిరోజు తండ్రి వెంట పొలం పనులకు పోవడం, సాయంత్రం పశువులకు గడ్డి కోసుకుని రావడం. ఇదీ అతని దినచర్య. వయసొచ్చింతర్వాత సేద్యం పనులు, కూలినాలితో సరిపెట్టుకునేవాడు.



బాలచంద్రుడు ఎన్నికల్లో పోటీ చేశాడు. అతను గెలవాలని వాళ్ల ఊర్లో ఉన్న బండయ్య దేవునికి మొక్కుకున్నాడు రంగయ్య. తన చేతి నుంచి ఖర్చు పెట్టుకొని చుట్టపక్కాలిండ్లకు తిరిగి ఓట్లు వేయమని ప్రచారం చేశాడు.

***

ఊరు బైట మండల కేంద్రానికి పోయే మట్టిరోడ్డు. పక్కనే మంచినీటి ట్యాంకు కట్టారు. దానికింద హోదాలకు తగ్గట్టుగా నాయకుల పేర్లు రాసిన శిలాఫలకపు దిమ్మె. ఫలకానికి పచ్చని సిల్కు గుడ్డ కప్పినారు. దాన్ని లాగి పథకాన్ని ప్రారంభిస్తాడు మంత్రి.

పసుపు కుంకుమ, కర్పూరం, తాంబూలం, కొబ్బరి కాయలూ అన్నింటితో పూజారులు సిద్ధంగా ఉన్నారు. చుట్టూ పది పల్లెల నుంచి వచ్చిన జనం ఇసుక వేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయారు. ట్యాంకు దగ్గిర నుంచి రోడ్డుకిరువైపులా బారికేడ్లు కట్టారు. జనాన్ని రోడ్డు మీదికి రాకుండా బారికేడ్ల కిరువైపులా నిలబడున్నారు పోలీసులు. తప్పాజారి ఎవరైనా రోడ్డు మీదికి వస్తే లాఠీలు తిప్పుతున్నారు.

**పసుపు కుంకుమ, కర్పూరం, తాంబూలం, కొబ్బరి కాయలూ అన్నింటితో పూజారులు సిద్ధంగా ఉన్నారు. చుట్టూ పది పల్లెల నుంచి వచ్చిన జనం ఇసుక వేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయారు. ట్యాంకు దగ్గిర నుంచి రోడ్డుకిరువైపులా బారికేడ్లు కట్టారు. జనాన్ని రోడ్డు మీదికి రాకుండా బారికేడ్ల కిరువైపులా నిలబడున్నారు పోలీసులు. తప్పాజారి ఎవరైనా రోడ్డు మీదికి వస్తే లాఠీలు తిప్పుతున్నారు.**

పదకొండు గంటలు దాటింది. అందరిలో ఒకే ఆతృత, మంత్రి ఎప్పుడెప్పుడొస్తాడా అని. జనానికి ఒక ఫర్లాంగు ముందు సర్పంచు స్థాయి నుంచి పైస్థాయి నాయకులందరూ నిల్చున్నారు. మంత్రికి స్వాగతం పలకడానికి. వారి వెన్నంటి ఒక్కొక్క నాయకుడికి ఇద్దరేసి గన్‌మెన్‌లు కాపలా కాస్తున్నారు. ఆ దరిదాపులకు సామాన్యులెవరినీ రానీయడం లేదు. అవసరంగా తమ నాయకులను కలవాలని కొందరు బతిమిలాడుతున్నా పోలీసులు వినిపించుకోవడం లేదు. నాయకులు ఇది చూసీ చూడనట్లు ఉండిపోతున్నారు. సెల్ ఫోన్లు పట్టుకొని మంత్రి ఎందాక వచ్చాడో తెలుసుకోవడంలో బిజీగా ఉన్నారు.

'మండల కేంద్రం దాటినాడంటా..!' అన్నాడొక ఎమ్మెల్యే.

కండువాలు, శాలువాలు, పూలదండలు పట్టుకున్న వందిమాగదుల్లో కలకలం.

మంత్రి ప్రోగ్రాం ఇంత అట్టహాసంగా ఉంటుందా.. ఊహించలేదు రంగయ్య. తన చిన్ననాటి మిత్రున్ని చూడడానికి ఇంత మంది నాయకులు, ప్రజలు రావడంతో ఆనందం పట్టలేకున్నాడు. తను కన్పిస్తూనే అక్కున చేర్చుకుంటాడు బాలచంద్రుడు. ఆనందంతో కౌగిలించుకుంటాడు. 'బాగున్నావా..రంగయ్యా!' అంటూ ఆప్యాయంగా పలకరిస్తాడు. ఇక్కడున్న వాళ్లందరి కళ్లల్లో కుచ్చుకు పోతాడు తను. ఆ ఘడియల కోసం ఎదురుచూస్తున్నాడు రంగయ్య. బారికేడ్ల పక్కన నిల్చుని.

'మంత్రి వస్తున్నాడు! మంత్రి వస్తున్నాడు' జనంలో కలకలం. అందరూ తలలెత్తి రెప్పవాల్చకుండా చూస్తున్నారు. వాహనాలు కనిపించకుండా దట్టంగా ఎర్ర ధూళి కమ్ముకునింది. పోలీసులు లాఠీ కట్టెలతో రోడ్డుకు అడ్డుకట్ట వేశారు. నాయకుల్ని సమీపించిన వాహనాలు గర్రని ఒకదాని వెనక ఒకటి వరుసగా ఆగినాయి.

'పరంధామయ్య! పరంధామయ్య!' అన్నారు పెద్దలందరూ ఒకే సారి. వెనక వాహనాల్లో నుండి రోడ్డు మీదికి దూకిన జనం ఒక్క పెట్టున నినాదాలు చేస్తున్నారు, 'పరంధామయ్య జిందాబాద్! పరంధామయ్య జిందాబాద్!' అంటూ. పరంధామయ్య నింపాదిగా కారు దిగాడు. ముసిముసిగా నవ్వుతూ రెండు చేతులెత్తి నమస్కరిస్తూ పెద్దల్లో కలిసిపోయాడు. అందరూ ఆప్యాయంగా అతన్ని పలకరించారు. పరంధామయ్య రాష్ట్రంలో పెద్ద పేరున్న బ్రాందీ షాపుల యజమాని. ఎన్నో పట్టణాల్లో అతనికి ఖరీదైన బార్లున్నాయి. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసిమెలిసి ఉంటాడు.

ఇంతలో మంత్రి వస్తున్నట్లు మళ్లీ కలకలం రేగింది. దుమ్ము రేపుకుంటూ మంత్రి కాన్వాయ్ వచ్చి ఆగింది.

ఎస్కార్టు డోరు తెరువగానే మంత్రి కారు దిగాడు. మొఖానికి చిరునవ్వు పులుముకొని చేతులెత్తి నాయకులకు నమస్కరించాడు. జనం వైపు తిరిగి చేయి ఊపాడు. బారికేడ్ల కిరువైపులా వున్న జనంలో ఉత్సాహం కట్టలు తెంచుకుంది. 'బాలచంద్రుడు జిందాబాద్! బాలచంద్రుడు జిందాబాద్' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ మంత్రి వైపుకు పరుగులు తీశాడు. కొందరు బారికేడ్లు దూకి వస్తున్నారు. రంగయ్య కూడా హడావుడిగా ముందుకు కదిలాడు. అక్కడక్కడా బారికేడ్లకు కట్టిన అడ్డుకట్టులు ఊడిపోయి సందులు ఏర్పడినాయి.

ఇది చూసిన స్థానిక పోలీసులు కంగారుగా పరుగెత్తుకు వచ్చారు. మంత్రికి చుట్టు వలయంగా నిల్చున్నారు. మరికొందరు పోలీసులు జనాన్ని మంత్రి దగ్గరికి రాకుండా నిలువరిస్తున్నారు. డివిజనల్ పోలీసు అధికారి దగ్గరుండి పెద్దలందరి చేత సత్కార కార్యక్రమం సాగించాడు. మంత్రి అందర్ని పేరుపేరున పలుకరిస్తూ కరచాలనం చేశాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు సాగాడు మంత్రి. పరంధామయ్య వందిమాగదులంతా ఒక్క పెట్టున జిందాబాదులు కొడుతూ మంత్రిని చుట్టుముట్టారు. కొందరు ఓ పెద్ద పూల దండ మోసుకొస్తున్నారు. జనాన్ని అటూఇటూ నెట్టి వారికి దారి ఏర్పాటు చేస్తున్నారు పోలీసులు.

ఒక ఎమ్మెల్యే పరంధామయ్య వైపు చూపిస్తూ 'మీ వయసుకు తగ్గట్టు నలభై రెండు కేజీల దండ తెచ్చాడు పరంధామయ్య!' అన్నాడు మంత్రితో. మంత్రి పరంధామయ్య వైపు అభిమానంగా చూశాడు.

పరంధామయ్య దండ పట్టుకున్నాడు. నాయకులందరూ తలా ఒక చేయి వేసి అంత పెద్ద దండను మంత్రికి వేసే కార్యక్రమం పూర్తి చేశారు. చుట్టుపక్కల వాళ్లంతా అలవాటుగా చప్పట్లు కొట్టారు. పరంధామయ్యతో కరచాలనం చేసి మంత్రి వడివడిగా ముందుకు సాగాడు.

తన్నుదాటుకుని పోతున్న మంత్రివైపు చూశాడు రంగయ్య. 'బాలచంద్రుడూ! బాలచంద్రుడూ!' అన్నాడు ఆత్రుతగా. మంత్రికి పట్టలేదు. రంగయ్య కేమీ దిక్కు తోచలేదు. గుంపులో వుండడం వల్ల మంత్రి తన్ను చూసి ఉండడని దండ పట్టుకుని కేకలు వేస్తూ పరుగు తీశాడు. అడ్డమొచ్చిన వారినందరిని బలంగా తోసుకుంటూ ముందుకు పోతున్నాడు. తనకు ముందు దూరంగా పోతున్న మంత్రి తప్ప అతని కేది కనిపించడం లేదు.

జనం తొక్కిసలాటలో కాలికున్న హవాయి చెప్పు లెప్పుడో తెగిపోయాయి. కాలి బొటన వేలికి గాయమై రక్తం కారుతూంది. అయినా లెక్కపెట్టలేదతను. 'బాలచంద్రుడూ!' అంటూ ముందుకు రాబోయాడు. ఇది గమనించిన ఎస్కార్టు పోలీసు అతన్ని బలంగా పక్కకు నెట్టాడు. కానీ అతను నిలదొక్కుకున్నాడు. తనకు సమీపంలో పోతున్న మంత్రి వైపు చూస్తూ దండ వేస్తానని మూగ భాషలో కళ్లతో పలకరించాడు. మంత్రి చటుక్కున చూపులు తిప్పుకుని అతన్ని చూడనట్లు ముందుకు వెళ్లిపోయాడు.

రంగయ్య మనస్సు చివుక్కుమంది. 'లేదు! లేదు! బాలచంద్రుడు అట్లా చేయడు!' అని మనసును కుదుట పర్చుకున్నాడు. పట్టు విడువకుండా మంత్రి వెన్నంటి వస్తున్నాడు. వెనక నుండి ఇది గమనించాడు మరొక పోలీసు. పరుగెత్తుకుంటూ వచ్చాడు. రంగయ్య నడుము పట్టుకుని బలంగా పక్కకు విసిరాడు. ఒక్క ఉదుటున బారికేడ్ల మీద పడ్డాడు రంగయ్య. నిలదొక్కుకోలేక కిందపడ్డాడు. పూలదండ విసురుకపోయి దూరంగా పడింది.

ఒక ఆకతాయి దండను తీసుకుని ముక్కలు చేశాడు. విడిపూలను జనం మీద చల్లుతూ జై అంటూ కేకలు వేసుకుంటూ పరుగెత్తాడు.

రంగయ్యకు నీరసం నిండుకుంది. బలమంతా కూడదీసుకుని లేవబోయాడు. వెనకుండి పరుగెత్తుకొస్తున్న ఒకతను బలంగా గుద్దుకున్నాడు. మళ్లీ కింద పడిపోయాడు రంగయ్య. జనం వరదలాగా పరుగెత్తుకొస్తున్నారు. అతన్ని పట్టించుకోకుండా గబగబా తొక్కుకుంటూ పోతున్నారు.

★